



మాట్లాడుతున్న ట్రిపుల్ ఐటీ నాన్‌టీచింగ్ సిబ్బంది

## వీసీపై ఆరోపణలను ఖండిస్తున్నాం..

బాసర, అక్టోబర్ 8 : బాసర ట్రిపుల్ ఐటీ వీసీపై వస్తున్న ఆరోపణలను తాము ఖండిస్తున్నామని కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్, నాన్‌టీచింగ్ ఉద్యోగులు అన్నారు. మంగళవారం వారు మాట్లాడుతూ.. ట్రిపుల్‌ఐటీ అభివృద్ధికి నిరంతరం కష్టపడుతు రాష్ట్రంలోనే ఉన్నత స్థానంలో నిలపాలని శ్రమిస్తున్న వీసీపై ఇలాంటి ఆరోపణలు చేయడం ఆవేదన కలిగిస్తుందన్నారు. యూనివర్శిటీ ప్రతిష్ఠను దిగజార్చే విధంగా ఎవరు వ్యవహరించవద్దని కోరారు. ఈ ఆరోపణలను తాము ఖండిస్తున్నామన్నారు.

# ‘చెక్‌డ్యాం’లకు రాజకీయ గ్రహణం

నిర్మల్ మండలంలోని వెంగ్వాపేట గ్రామ శివారులో స్వర్ణ వాగుపై చెక్‌డ్యాం నిర్మించే ప్రాంతం

### బీఆర్‌ఎస్ హయాంలోనే రూ.100 కోట్లు మంజూరు

- కాంగ్రెస్ అధికారంలోకి రాగానే నిలిచిన పనులు
- అగ్రిమెంట్లు పూర్తయినా ముందుకు రాని కాంట్రాక్టర్లు
- నిధులు మంజూరైనా ప్రారంభం కాని పనులు



వెంగ్వాపేట వద్ద చెక్‌డ్యాం నిర్మాణానికి ఏడాది క్రితం వేసిన శిలాఫలకం

నిర్మల్, అక్టోబర్ 8(నమస్తే తెలంగాణ) : గోదావరి, దాని ఉపనదుల నీరు వృథా కాకుండా అప్పటి కేసీఆర్ సర్కారు నీటిని ఒడిసి పట్టేందుకు చెక్‌డ్యాంల నిర్మాణానికి శ్రీకారం చుట్టింది. వాగులు, వంకల ద్వారా సముద్రం పాలవుతున్న నీటిని అడ్డుకట్ట వేయడానికి ఎక్కడికక్కడ చెక్‌డ్యాంలను నిర్మించ సంకల్పించింది. ఫలితంగా భూగర్భ జలాలు పెరగడంతోపాటు సాగు, తాగునీటి అవసరాలకు ఇబ్బంది లేకుండా పోయాయి. నిర్మల్ జిల్లాలోని ప్రధాన వాగులపై మొదటి విడుతలో 21 చెక్‌డ్యాంలను నిర్మించిన బీఆర్‌ఎస్ ప్రభుత్వం.. రెండో విడుతలో మరిన్ని నిర్మించేందుకు ప్రణాళికలు సిద్ధం చేసింది. ఇందులో భాగంగానే నిర్మల్, ఖానాపూర్, ముథోల్ నియోజకవర్గాల పరిధిలో దాదాపు రూ.100 కోట్లతో 19 చెక్‌డ్యాంలను నిర్మించేందుకు ప్రణాళికలు రూపొందించింది. అవసరమైన ప్రతిపాదనలు ప్రభుత్వానికి కూడా పంపింది. మూడు నియోజకవర్గాల్లోని 5,610 ఎకరాలకు సాగు నీరందించే లక్ష్యంతో ఈ చెక్‌డ్యాంలను ప్రతిపాదించారు. దీనికి స్పందించిన అప్పటి బీఆర్‌ఎస్ ప్రభుత్వం రూ.114 కోట్లకు పరిపాలన పరమైన ఆమోదాన్ని తెలుపుతూ నిధులను కూడా మంజూరు చేసింది. ఆయా పనులకు టెండర్ ప్రక్రియ పూర్తి చేసి కాంట్రాక్టర్లకు పనులను అప్పగించడమే కాకుండా, పనులకు శంకుస్థాపన కూడా చేశారు. పనులు మొదలవుతాయని భావిస్తున్న తరుణంలోనే ఎన్నికలు రావడం.. ఆ తర్వాత కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడంతో పరిస్థితులు తలకిందులయ్యాయి.

**అభివృద్ధి పనులను నిలిపివేసిన కాంగ్రెస్ ప్రభుత్వం**

కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే బీఆర్‌ఎస్ హయాంలో మంజూరైన అభివృద్ధి పనులను నిలిపివేయాలని అధికారులను ఆదేశించింది. ఇందులో భాగంగానే 19 చెక్‌డ్యాంల పనులను చేపట్టవద్దని, మంజూరైన నిధులను వెనక్కి తీసుకుంటున్నట్లు ప్రకటించింది. దీంతోపాటు అప్పటికే పూర్తయిన టెండర్లను కూడా రద్దు చేయాలని నిర్ణయించింది. అయితే బీఆర్‌ఎస్ హయాంలో అధికారులు రూపొందించిన అంచనాల కన్నా తక్కువ ధరలతో టెండర్లు దాఖలు కావడం, అలాగే టెండర్లు వేసిన ఏజెన్సీలకు నిర్మాణ రంగంలో మంచి అనుభవం ఉన్న కారణంగా కాంగ్రెస్ ప్రభుత్వం తిరిగి ఈ చెక్‌డ్యాంల నిర్మాణ పనులను పాత ఏజెన్సీలతోనే చేపట్టేందుకు నిర్ణయించింది. దీనికి అనుగుణంగానే నీటిపారుదల శాఖ అధికారులకు ఆదేశాలు జారీ చేసింది. అయితే ఆయా నియోజకవర్గాల ముఖ్య నాయకుల ఒత్తిళ్ల కారణంగానే పనులను చేపట్టేందుకు కాంట్రాక్టర్లు ముందుకు రావడం లేదు. ఒకవేళ పనులు చేపట్టినా.. రాజకీయ ఒత్తిళ్ల కారణంగా తమకు బిల్లులు వస్తాయో లేదోనన్న సందేహంలో కాంట్రాక్టర్లు ఉన్నారు. రాజకీయ కారణాల వల్లనే దాదాపు రూ.100 కోట్ల పనులు మొదలు కావడం లేదు. ఈ నేపథ్యంలో పనుల ప్రారంభానికి రాష్ట్ర ప్రభుత్వం చొరవ చూపాలని జిల్లావాసులు కోరుతున్నారు.

# రుణమాఫీ, ఆరు గ్యారెంటీలను అమలు చేయాల్సిందే..

### దసరా వరకు ప్రభుత్వం హామీలను నెరవేర్చకపోతే ఆందోళనలు చేపడుతాం..

- రైతులను మోసం చేసిన కాంగ్రెస్‌ను వదిలేది లేదు..
- సీఎం, మంత్రుల ప్రకటనలకు పొంతన లేదు..
- సీఎం రేవంత్‌పై పోలీసులకు ఫిర్యాదు చేశాం..
- మాజీ మంత్రి జోగు రామన్న



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి జోగు రామన్న

ఆదిలాబాద్, అక్టోబర్ 8(నమస్తే తెలంగాణ) : ఎన్నికల సమయంలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రకటించిన రూ.2 లక్షల రుణమాఫీ, ఆరు గ్యారెంటీలను దసరా పండుగ లోగా పూర్తిస్థాయిలో అమలు చేయాలని మాజీ మంత్రి, బీఆర్‌ఎస్ ఆదిలాబాద్ జిల్లా అధ్యక్షుడు జోగు రామన్న డిమాండ్ చేశారు. మంగళవారం బీఆర్‌ఎస్ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను అమలు చేయకపోతే పెద్ద ఎత్తుగా ఆందోళనలు నిర్వహిస్తామని, పార్టీ నాయకులు హాజరవుతారని తెలిపారు. రూ.2 లక్షల పంట రుణాల మాఫీ విషయంలో సీఎం రైతులను మోసం చేశాడని, అన్నదాతలను అవమానించేలా ప్రకటనలు చేస్తున్న ఆయనపై చర్యలు తీసుకోవాలంటూ పోలీసులకు ఫిర్యాదు చేశామన్నారు. రైతులకు పూర్తిస్థాయిలో రుణమాఫీ చేసినట్లు ప్రధానికి లేఖ రాయడం హాస్యాస్పదమన్నారు. రాష్ట్రంలో మిగిలిన 20 లక్షల మంది రైతులకు ప్రభుత్వం ఎప్పుడు బ్యాంకు లోన్‌ను రద్దు చేస్తుందో స్పష్టం చేయాలని డిమాండ్ చేశారు. రుణమాఫీ విషయంలో సీఎం, మంత్రుల ప్రకటనలకు పొంతన ఉండడం లేదని, కాంగ్రెస్ పార్టీ ప్రజలకు ఇచ్చిన హామీలు నెరవేరే వరకు వదిలే ప్రసక్తే లేదన్నారు. రుణమాఫీ అనంతరం రైతుభరోసా అందిస్తామని మంత్రి అంటున్నారని వానకాలం ముగిసినా రైతుభరోసా డబ్బులు ఎప్పుడు బ్యాంకు ఖాతాల్లో వేస్తారో తెలుపాలని డిమాండ్ చేశారు.

**ఆదిలాబాద్ వస్తే సెగ తగులుతుంది..**

వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు రుణమాఫీ విషయంలో మతిస్థిమితం కోల్పోయి మాట్లాడుతున్నాడని, రైతుల నుంచి వ్యతిరేకత లేదని అంటున్నాడని జోగు రామన్న మండిపడ్డారు. ఆదిలాబాద్ జిల్లాలో 5,500 మంది రైతులకు రూ.550 కోట్ల రుణమాఫీ జరిగిందని, ఇంకా 8 వేల మందికి మాఫీ కావాల్సి ఉందన్నారు. మంత్రి తుమ్మల ఆదిలాబాద్ పర్యటనకు వస్తే రైతుల సెగ తెలుస్తుందన్నారు. ఆదిలాబాద్ పర్యటనలో రాహుల్‌గాంధీ ఆరు గ్యారెంటీలకు చట్టబద్ధత కల్పిస్తామని ప్రకటించారన్నారు. ప్రజలను మోసం చేస్తున్న కాంగ్రెస్ నాయకులను దేనితో కొడితే దెబ్బతగులుగుతుందో తెలుపాలన్నారు. రుణమాఫీ కాని రైతుల ఇంటికి వెళ్లి సర్వే చేసి రెండు నెలలు కావస్తున్నా ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం దురదృష్టకరమని తెలిపారు. ఆగస్టు చివరి వారంలో కురిసిన భారీ వర్షాల కారణంగా 3,200 ఎకరాల్లో పంటలకు నష్టం వాటిల్లిందని, పంట నష్టపోయిన రైతులకు రూ. 10 వేల పరిహారం ఇస్తామని ప్రభుత్వం ప్రకటించినా ఫలితం లేదన్నారు. జిల్లా వ్యాప్తంగా సోయాబిన్ కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలన్నారు. ఆయన వెంట బీఆర్‌ఎస్ నాయకులు రోకండ్ల రమేశ్, మెట్టు ప్రహ్లాద్, విజ్జగిరి నారాయణ, యాసం నర్సింగరావు, కుమ్రరాజు, నవాతే శ్రీనివాస్, ఆసిఫ్ ఉన్నారు.



ఆదిలాబాద్ మార్కెట్‌యార్డులో మంగళవారం ఉదయం రైతులు తీసుకొచ్చిన సోయాబిన్

# కొనుగోళ్లకు ఏర్పాటు చేయాలి

- నిర్మల్ కలెక్టర్ అభిలాష అభినవ్



మాట్లాడుతున్న కలెక్టర్ అభిలాష అభినవ్

నిర్మల్ అర్బన్, అక్టోబర్ 8 : ధాన్యం కొనుగోళ్లను పకడ్బందీగా చేపట్టాలని కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో కొనుగోళ్లు, కేంద్రాల ఏర్పాటుకు చేపట్టాల్సిన చర్యలపై రెవెన్యూ అదనపు కలెక్టర్ కిశోర్‌కుమార్‌తో కలిసి సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. కొనుగోలు కేంద్రాల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. దొడ్డు, సన్నరకం కేంద్రాలను వేర్వేరుగా ఏర్పాటు చేయాలని ఆదేశించారు. సన్నరకం ధాన్యానికి రూ.500 బోనస్ ఇస్తామని తెలిపారు. మిల్లింగ్‌లో ఇబ్బందులు తలెత్తకుండా సన్న, దొడ్డు రకం ధాన్యం బస్తాలను వేర్వేరు మిల్లులకు తరలించాలని సూచించారు. కొనుగోళ్ల వివరాలను రిజిస్టర్‌లో నమోదు చేయాలన్నారు. ధాన్యం కొనుగోలు చేసిన 48 గంటల్లో రైతుల ఖాతాల్లో డబ్బులు జమ అయ్యే విధంగా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ధాన్యం అక్రమ రవాణా జరుగకుండా అంతర్రాష్ట్ర సరిహద్దు చెక్‌పోస్టులను ఏర్పాటు చేయడంతోపాటు మొబైల్ చెక్‌పోస్టులను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో డీఎస్‌వో కిరణ్‌కుమార్, డీఎం వేణుగోపాల్, జిల్లా వ్యవసాయశాఖ అధికారి అంజీప్రసాద్, డీఆర్డీవో విజయలక్ష్మి, లీడ్ బ్యాంక్ మేనేజర్ రామ్ గోపాల్ పాల్గొన్నారు.

# మొబైల్‌కు బదులు బండరాళ్లు

- ఠాణాను ఆశ్రయించిన బాధితులు, గ్రామస్తులు



ఫోన్‌కు బదులు బండరాళ్లు ఉన్న పార్సిల్

బజార్‌హత్నూర్, అక్టోబర్ 8 : ఆదిలాబాద్ జిల్లా బజార్‌హత్నూర్ మండలంలోని దేగామా గ్రామానికి చెందిన కొక్కుల ఉదయ్‌కుమార్, మంగళగిరి రాంచరణ్‌లు అక్టోబర్ 2వ తేదీన ఆన్‌లైన్‌లో మొబైల్స్ బుక్ చేశారు. ఉదయ్‌కుమార్ ఫ్లిప్‌కార్టులో వీవో టీ 2(రూ.24 వేలు), రాంచరణ్ ఇకాం ఎక్స్‌ప్రెస్‌లో టీ 3(రూ.11,500) ఆర్డర్ పెట్టారు. అక్టోబర్ 8వ తేదీ ఉదయం డెలివరీ బాయ్ అరవింద్ పార్సిల్‌ను ఉదయ్‌కుమార్‌కు ఇచ్చాడు. అతను తెరిచి చూడగా అందులో బండరాళ్లు, సబ్బు బిల్లలు దర్శనమివ్వడంతో ఖంగుతిన్నాడు. వెంటనే మోసపోయానని గ్రహించి రాంచరణ్‌కు ఫోన్ చేశాడు. జరిగిన విషయం చెప్పాడు. అదే సమయంలో ఇకాం ఎక్స్‌ప్రెస్‌లో బుక్ చేసిన ఫోన్‌ను తీసుకుని డెలివరీ బాయ్ కార్తీక్ రాంచరణ్ వద్దకు వచ్చాడు. బండరాళ్లు ఉంటాయనే అనుమానంతో పార్సిల్‌ను ఓపెన్ చేసిన తరువాతే డబ్బులు ఇస్తామని చెప్పాడు. మాకేలాంటి సంబంధం లేదని కంపెనీ డెలివరీ బాయ్ తెలుపడంతో రాంచరణ్, 20 మంది గ్రామస్తులు పోలీస్ స్టేషన్‌ను ఆశ్రయించారు. పోలీసులు, గ్రామస్తుల సమక్షంలో పార్సిల్‌ను తెరిచి చూడగా అందులో మొబైల్ ఉంది. ఇదిలా ఉండగా.. ఉదయ్‌కుమార్‌కు సంబంధించి ఫ్లిప్‌కార్టు సూపర్ వైజర్‌కు పోలీసులు ఫోన్ చేయగా.. అతను మొబైల్‌కు సంబంధించిన రూ.24 వేలను తిరిగి ఇచ్చేశాడు.



పోస్టర్‌ను విడుదల చేస్తున్న పీవో ఖుష్బూ గుప్తా, నాయకులు

## కుమ్రం భీం వర్ధంతి పోస్టర్ల ఆవిష్కరణ

ఉట్నూర్, అక్టోబర్ 8 : ఉట్నూర్ ఐటీడీఏ పీవో క్యాంపు కార్యాలయంలో ఈనెల 17వ తేదీన కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లా కెరమెరి మండలంలోని జోడేఘాట్‌లో నిర్వహించే వర్ధంతి పోస్టర్లను పీవో ఖుష్బూ గుప్తా విడుదల చేశారు. ఈ సందర్భంగా పీవో మాట్లాడుతూ.. ఆదివాసుల ఆరాధ్య దైవం కుమ్రం భీం వర్ధంతికి అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఆదివాసీ సంఘాల నాయకులు, ఉత్సవ కమిటీ సభ్యులు, పోలీసులు ఉన్నారు.

# సోయా కొనుగోళ్లు ముమ్మరం

నమస్తే ఎఫెక్ట్

- మార్కెట్‌కు భారీగా పంటను తీసుకొచ్చిన రైతులు
- నాణ్యతను పరిశీలించి కొనుగోలు చేసిన సిబ్బంది

ఆదిలాబాద్, అక్టోబర్ 8(నమస్తే తెలంగాణ) : ‘నమస్తే తెలంగాణ’లో మంగళవారం ‘సోయా కొనుగోళ్లు ఏమాయే’ శీర్షికతో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. సోమవారం మధ్యాహ్నం ఆదిలాబాద్ మార్కెట్ యార్డు గేటు తీయకపోవడంతో వాహనాల్లో సోయా పంటను విక్రయించడానికి వచ్చిన రైతులు బయట నిరీక్షించాల్సి వచ్చింది. రైతుల ఇబ్బందులను ‘నమస్తే’ ఫొటోలతో ప్రచురించింది. ఆదిలాబాద్ మార్కెట్ యార్డు సిబ్బంది మంగళవారం ఉదయమే గేటు తీయగానే రైతులు భారీగా పంటను విక్రయానికి తీసుకొచ్చారు. దీంతో యార్డులోని షెడ్డు సోయాబిన్ కుప్పలతో నిండిపోయింది. మార్క్‌ఫెడ్ ఆధ్వర్యంలో కొనుగోళ్లు జరుగుతుండగా.. సహకార సంఘాల ద్వారా సేకరిస్తున్నారు. సహకార సంఘం సిబ్బంది నాణ్యతతోపాటు తేమ శాతాన్ని పరిశీలించారు. చెత్తాచెదారం ఉన్న సోయాను జల్లెడ పట్టాలని సూచించారు. 50 కిలోల గన్నీ బ్యాగులు తీసుకొచ్చి నిబంధనల మేరకు తేమ ఉన్న పంటను కాంటా చేశారు. కొనుగోళ్లు ప్రారంభంకావడంతో రైతులు సంతోషం వ్యక్తం చేశారు.



పంటలో తేమ శాతాన్ని పరిశీలిస్తున్న సిబ్బంది



విద్యుద్దీపాల వెలుగులో ఆలయం



అమ్మవారి దర్శనానికి క్యూలైన్‌లో వేచి ఉన్న భక్తులు

# బాసరకు నవరాత్రి శోభ

- విద్యుద్దీపాల వెలుగులో ఆలయం
- అక్షర శ్రీకారాలకు పోటెత్తిన భక్తజనం
- నేడు మూల నక్షత్ర పూజలు

బాసర, అక్టోబర్ 8 : బాసర సరస్వతీ క్షేత్రంలో నవరాత్రి ఉత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. ఆరో రోజైన మంగళవారం అమ్మవారు కాత్యాయని రూపంలో దర్శనం ఇచ్చారు. భక్తులు తమ చిన్నారులకు అక్షర శ్రీకార పూజలు నిర్వహించారు. అమ్మవారి దర్శనానికి భక్తులు భారీ సంఖ్యలో తరలివచ్చారు. రద్దీ అధికంగా ఉండడంతో గంటల తరబడి క్యూలైన్‌లలో వేచి ఉన్నారు.

**నేడు మూల నక్షత్ర పూజలు**

బుధవారం మూల నక్షత్ర పూజలు నిర్వహించనున్నారు. ఇందుకోసం అధికారులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. అమ్మవారికి ప్రభుత్వం తరపున పట్టు వస్త్రాలను సమర్పించనున్నారు. మూల నక్షత్ర పూజకు భక్తులు అధిక సంఖ్యలో హాజరయ్యే అవకాశం ఉంది. ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు ఏర్పాట్లు చేశారు.



భక్తుల కోసం ఏర్పాటు చేసిన క్యూలైన్‌లు



కాత్యాయని రూపంలో అమ్మవారు